జోరుగా ఇసుక దందా

- రాత్రివేళల్లో గుట్టుగా తరలింపు
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసు అధికారులు
- సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు

గండేడ్/మహమ్మదాబాద్: ఉమ్మడి మండలపరిధిలో రాత్రివేళల్లో ఇసుక దందా జోరుగా సాగుతోంది. అరికట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తుండడంతో అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి మండల పరిధిలో ఇటీవల నిర్మాణాలు జోరుగా సాగుతుండడంతో ఇసుకకు డిమాండు బాగా పెరిగింది. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు అక్రమ తరలింపునకు తెరతీశారు. కాగా కొందరు అధికారులు మామూళ్లకు లొంగి అడ్డుకట్ట వేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆయా చోట్ల పరిస్థితి ఇలా..

పగిడ్యాల్ నుంచి రెగ్యులర్‌గా ఇసుక తరలింపు కొనసాగుతోంది. గ్రామ సమీపంలోని మల్లమ్మ చెరువు వద్ద కొన్ని రోజులుగా ఇసుకను తీస్తున్నారు. ఉదయం ఉపాధి హామీ కూలీలను ట్రాక్టర్లలో తీసుకెళ్లి పనులు పూర్తయ్యాక పట్టపగలే ఇసుకను లోడ్ చేసుకొని తీసుకెళ్తున్నారు. ఇక్కడ నాలుగు వైపులా దారులుండడంతో ఎవరు వెళ్లినా వెంటనే అక్రమార్కులు తప్పించుకుపోతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.

- పరుగుల తండాకు వెళ్లే దారిలోనూ వాగు నుంచి ఇసుక తరలింపు సాగుతోంది. ఒక్కో ట్రిప్‌కు రూ. 3000 నుంచి రూ. 3500 వరకు తీసుకుని సొమ్ము చేసుకుంటున్నారని తెలుస్తోంది.
- మహమ్మదాబాద్ పరిధిలోని ధర్మాపూర్ అటవీ ప్రాంతంతో పాటు మల్కచెరువు నుంచి, తండాల సమీపంలోని వాగుల నుంచి యథేచ్ఛంగా తరలింపు సాగుతోంది.
- అన్నారెడ్డిపల్లి వాగుల నుంచి కూడ తరుచుగా ఇసుకను తీసుకెళ్తున్నారు. ఇది మహమ్మదాబాద్ మండల కేంద్రానికి దగ్గర్లో ఉన్నా అక్రమదందాకు అడ్డుకట్ట పడడం లేదు. ఫిల్టర్ ఇసుక తయారీసైతం జోరుగా సాగుతోంది. గతంలో రెవెన్యూ వారు వాటిని ధ్వంసం చేసినా.. కొంతమంది తిరిగి వాటిని పునరుద్ధరించుకుని దందాసాగిస్తుండడం గమనార్హం.
- గాధిర్యాల్ సమీపంలోని పుట్టపహాడ్ వాగు నుంచి పలు గ్రామాలకు ఇసుకను తరలిస్తున్నారు.



మహమ్మదాబాద్‌లో తయారు చేసిన ఫిల్టర్ ఇసుక



అన్నారెడ్డిపల్లిలో ఫిల్టర్ ఇసుక బెడ్

- కాగా కోయిల్‌కొండ పరిధిలోని సురారం నుంచి, కోస్గి మండలం ముదిరెడిపల్లి నుంచి గండేడ్ మండలంలోని పలుగ్రామాలకు జోరుగా రవాణా సాగుతోంది.
- ఇసుకకు డిమాండ్ బాగా ఉంటుండడంతో ఉమ్మడి మండలంలో చాలామంది ఈ దందాను జీవనోపాధిగా మార్చుకుంటుండడం గమనార్హం. ఎన్నిసార్లు అధికారులు పట్టుకున్నా అలాగే దందాలు నిర్వహిస్తున్నారు. కాగా వీరికి అడ్డుకట్ట వేయడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఇటీవల ఓ వ్యాపారి దందాకు సంబంధిత అధికారులకు, నాయకులకు డబ్బులు ఇస్తున్నామంటూ.. తానూ ఆత్మహత్య చేసుకుంటానని ఓ ఆడియో వైరల్ చే యడం కూడా మండలంలో చర్చనీయాంశమైంది. దీనిపై ఉన్నత అధికారులు విచారణ సైతం చేపట్టారు. ఈ ఘటన తర్వాత కొంతకాలం తరలింపు నిలిచిపోయినా.. తిరిగి షరామామూలైంది. ఈ నేపథ్యంలో అధికారులు దందా చేస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకుని అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం



ఇసుక అక్రమ రవాణ జరగకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటున్నాం. రాత్రివేళల్లో మా సిబ్బంది గస్తీ తిరుగుతున్నారు. పగిడ్యాల్, రంగారెడ్డిపల్లి గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. సదరు ఇసుక వ్యాపారులకు కూడా గట్టి హెచ్చరికలు చేశాం. సురారం ట్రాక్టర్ల వారు ఇటువైపు రావద్దని హెచ్చరించాం. ఒకవేళ ట్రాక్టర్లు దొరికితే మాత్రం కేసులు నమోదు చేస్తాం.

– శేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ, మహమ్మదాబాద్.

అనుమతి లేదు



ఇసుక అక్రమ రవాణ జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. గతంలో కలెక్టర్ ఆదేశాల మేరకు అనుమతులు ఇచ్చాం. ప్రస్తుతం ఎలాంటి అనుమతి లేదు. ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటాం.

– నాగలక్ష్మి, తహసీల్దార్, గండేడ్

బడులు తెరిచేలోగా పనులు పూర్తి చేయాలి



లింగంపల్లిలో పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

నవాబుపేట: బడుల ప్రారంభం నాటికి ఆయా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ సూచించారు. మంగళవారం లింగంపల్లి పాఠశాలలో అమ్మఆదర్శ పాఠశాలల పనులను పరిశీలించారు. మండల అధికారులతో మాట్లాడారు. త్వరగా పనులు పూర్తి చేయించాలన్నారు. నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అన్ని పాఠశాలల్లోనూ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మండలంలో ఇంకా చాలా పాఠశాలల్లో పనులు ప్రారంభించలేదని.. వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పనులు చేసిన వెంటనే బిల్లులు చెల్లింపు వేగవంతం చేయాలన్నారు. ఆయా పాఠశాలల్లో కొనసాగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ రాజునాయక్, జనార్దన్ తదితరులు ఉన్నారు.

మిడ్జిల్‌లో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే



సర్వేలో పాల్గొన్న సిబ్బంది

మిడ్జిల్: మండల కేంద్రంలో పశువైద్య కేంద్రం సమీపంలోని స్థానికులు చికెన్‌గున్యా, జ్వరాల బారినపడిన నేపథ్యంలో మంగళవారం మండల వైద్య సిబ్బంది, జిల్లా టీం ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి సర్వే చేపట్టారు. పలు సూచనలు చేశారు. ఇళ్లలో నీరు నిల్వ లేకుండ చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. దోమల లార్వాలు ఉన్న చోట కెమికల్స్‌ను స్ప్రే చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శివకాంత్, యుగంధర్, రమేష్, జానకిరామ్ పాల్గొన్నారు.

ఉపాధిపనుల పరిశీలన



బాలానగర్: ఎంపీడీఓ శరత్‌చంద్ర బాబు మంగళవారం మోతీఘణాపూర్, మేడిగడ్డ తండా, కుర్వగడ్డ తండా, గంగధారిపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఈజీఎస్ పనులను, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. పనులు చేస్తున్న చెరువులలో వర్షాలు కురవక ముందే.. పూడికతీతకు సంబంధించిన రికార్డులను నమోదు చేయాలని అన్నారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులను పరిశీలించి సూచనలు చేశారు.

దేవరకద్ర: మండలకేంద్రం సమీపంలోని కోయిల్ సాగర్ ఎడమ కాల్వలో మంగళవారం జోరుగా ఉపాధి హామీ పనులు కొనసాగాయి. మండల అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు.

పాఠశాలల్లో స్వీపర్లను నియమించాలి

జడ్చర్ల టౌన్: ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోగా స్వీపర్లను నియమించాలని బీసీసేన నియోజకవర్గ కార్యదర్శి రామస్వామి, మండల ప్రధాన కార్యదర్శి జి.నర్సింహులు మంగళవారం ప్రభుత్వాన్ని కోరారు. బీసీసేన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రైవేట్‌పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించటాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. జడ్చర్లలో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఆటస్థలాలు లేకుండానే నిర్వహిస్తున్నారని వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు నరేందర్ యాదవ్, రాజు, శివశంకర్, సుధాకర్‌లు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ జరిపించాలి

జడ్చర్ల టౌన్: బాదేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ యాదగిరి అక్రమాలపై విచారణ జరిపించి సస్పెండ్‌చేయాలని గంగాపురంనకు రైతు రాజశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ సుధాకర్‌రెడ్డి మంగళవారం డిమాండ్ చేశారు. పీఏసీఎస్ కార్యాలయం వద్ద మాట్లాడుతూ కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశామన్నారు. ముఖ్యంగా యూరియా విషయంలో రూ.4.5 లక్షల పైగా కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. పలువిషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు వివరించారు. విషయంపై పీఏసీఎస్ చైర్మన్ సుదర్శన్‌గౌడ్‌ను వివరణ కోరగా యూరియా కుంభకోణం విషయంలో తాము చేసేదంతా చేశామని, మెమోలు ఇవ్వటం, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయటం చేశామన్నారు. విచారణలో ఉందని వివరించారు.

లేగదూడకు పంచనామా

గండేడ్: పిడుగుపాటుకు గురై మృతిచెందిన లేగదూడకు మంగళవారం పంచనామా నిర్వహించారు. కప్లాపూర్‌కి చెందిన కావలి కృష్ణయ్య పొలం దగ్గర పశువులను మేపుతుండగా సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈ సమయంలో పిడుగు పడడంతో లేగదూడ అక్కడిక్కడే మృతి చెందింది. ఈవిషయం రెవెన్యూ, పశువైద్య శాఖ అధికారులకు తెలియజేయడంతో మంగళవారం ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. కాగా బాధితుడు కృష్ణయ్య ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కోరారు. పశువైద్య సిబ్బంది మంగమ్మ, వీఆర్‌ఏలు రాంచంద్రయ్య, సత్యయ్య తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్

కోయిల్‌కొండ: కాంగ్రెస్‌లో పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆచార్యపూర్‌లో మృతిచెందిన నక్కతిరుమలయ్య పార్థివదేహానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం సంగనోనిపల్లిలో ఉపసర్పంచ్ రాజు దినకర్మ కార్యక్రమానికి హాజరై కుటుంబసభ్యులకు పరామర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. కార్యకర్తలు ఎవ్వరుకూడా అధైర్య పడవద్దని ఆమె సూచించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.విద్యాసాగర్‌గౌడ్, మండల అధ్యక్షుడు జి.రవీందర్, యాదయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అందరిపై భగవంతుడి అనుగ్రహం ఉండాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: మనందరిపై ఆ భగవంతుడి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం ఎర్రసత్యం చౌరస్తా సమీపంలో శ్రీహనుమత్, హయగ్రీవ, ధన్వంతరి, లక్ష్మీనరసింహ ఇష్టియజ్ఞ మహోత్సవంలో మంగళవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి వేద ఆశీర్వాదం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లోకకల్యాణార్థం పలుకూరి తిరుమలాచార్యస్వామి చేపట్టిన మహత్తర యజ్ఞం చాలా విశేషమైనదని, తాను ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. పట్టణంలోని ప్రజలందరూ ఈ మహాయజ్ఞంలో పాల్గొని సకల దేవత అనుగ్రహం పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడికి సాయం



కోయిల్‌కొండ: ఎంపీఎస్ కళాశాలలో (1992–95 బ్యాచ్) పూర్వ విద్యార్థులు తమతో పాటు చదువుకున్న గార్లపహాడ్ గ్రామానికి చెందిన బాలస్వామికి చేయూతనందించారు. మంగళవారం రూ. లక్ష ఆర్థికసాయం చేశారు. చదువులో ఎప్పుడూ ముందుండే బాలస్వామి డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో మానసిక స్థితి దెబ్బతిని పరీక్షలకు దూరంగా వెళ్లిపోయాడు. దీంతో అతడి తండ్రి ఆవేదనకు గురై మరణించారు. కాగా నాటినుంచి కుటుంబం పేదరికంతో ఇబ్బందులు పడుతున్న క్రమంలో బాలస్వామి మిత్రులు సాయం అందించేందుకు ముందుకు వచ్చారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్



వేసవి శిబిరం ముగింపులో మాట్లాడుతున్న రాజశేఖర్

జడ్చర్ల టౌన్: వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే మంచి భవిష్యత్ దక్కుతుందని ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని డిగ్రీకళాశాల మైదానంలో హెచ్‌సీఏ, యండీసీఏ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో పాల్గొన్న ఆయన క్రీడాకారులనుద్దేశించి ప్రసంగించారు. తొలిసారిగా హెచ్‌సీఏ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించటం జరిగిందని, శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. నెట్‌లో శిక్షణ చేసే అవకాశం వచ్చినందున మంచి క్రీడాకారులుగా తయారవ్వాలని, జిల్లా టీంలో జడ్చర్ల నుంచి ప్రాతినిథ్యం వహించేలా నైపుణ్యం సాధించాలన్నారు. తద్వారా రాష్ట్రంలోనూ మంచి అవకాశాలు వస్తాయన్నారు. శిబిరంలో 150మంది శిక్షణ పొందారు. ముగింపు సమావేశంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దత్తుకుమార్, జిల్లా పీజీటీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, జడ్చర్ల క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు రాంరెడ్డి, డా.రాఘవేందర్, సూరి, మోయిన్ పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనారసింహుడి కల్యాణం



మహమ్మదాబాద్‌లో కల్యాణోత్సవం



తాటికొండలో..

మహమ్మదాబాద్: మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు దిడ్డికాడిగోపాల్ దంపతులు, తదితరులు వేడుకలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

భూత్పూర్: తాటికొండలో మంగళవారం శ్రీ భూదేవి సమేత లక్ష్మీనారసింహస్వామి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థాన శైవాగమ పండితులైన తాళ్లపాక మణికంఠ శివాచార్యులు, వేదపండితుల ఆధ్వర్యంలో కార్యక్రమం సాగింది.

రాజీవ్ సేవలు మరువలేనివి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తదితరులు



అడ్డాకులలో..

సాల్లినెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా మంగళవారం రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. అడ్డాకుల, కందూర్ తదితర గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో మండలాధ్యక్షుడు తోట శ్రీహరి, విజయమోహన్‌రెడ్డి, జగదీశ్వర్, లింగారెడ్డి, భీమన్న, లక్ష్మీనారాయణ, షఫీ, దశరథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు నివాళి అర్పించారు.

- రాజాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రమేష్, గోవర్ధన్‌రెడ్డి, తఖీబాబా, నసీర్‌బేగ్, నరహరి తదితరులు పాల్గొన్నారు.
- దేవరకద్రలో పాత బస్టాండ్ వద్ద రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నర్సింహరెడ్డి, రాము, చిన్నయ్య పాల్గొన్నారు.
- హైదరాబాద్‌లోని నివాసంలో ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు. రాజీవ్ సేవలు మరువలేనివన్నారు. నాయకులు శివ, రాఘవేందర్‌రెడ్డి, ప్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.
- మహమ్మదాబాద్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, డీసీసీ మాజీ అధ్యక్షుడు కమతం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతీబాయి, అనంతయ్యగుప్త, రహీం, వేణు, విష్ణు, చెన్నయ్య పాల్గొన్నారు.
- గండేడ్‌లో మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బాలయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆశన్న, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆశన్న, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చిన్నయ్య, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ పులిందర్‌రెడ్డి, ఎస్టీ సెల్ నాయకుడు కోట్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.
- నవాబుపేటలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బంగ్లారవి, మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, జిల్లా నాయకులు మల్లేష్ యాదవ్, రాజేష్, హమీద్, సుధాకర్, రాజు, ఆంజనేయులు, కుమార్ పాల్గొన్నారు.



రోడ్డెక్కిన 'రైలింజన్'

మండలపరిధిలోని 44వ నంబర్ జాతీయ రహదారి గుండా మంగళవారం లారీపై రైలింజన్‌ను తీసుకెళ్తున్న దృశ్యం ప్రయాణికుల దృష్టిని ఆకర్షించింది. బెంగళూర్ నుంచి పంజాబ్‌కు రైలింజన్‌ను తరలిస్తూ మార్గమధ్యలో మంగళవారం ఉదయం శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద లారీని రోడ్డు పక్కన కొద్దిసేపు నిలిపారు. ఈ సమయంలో టోల్‌ప్లాజా దాటి వెళ్లే వాహనదారులు కొద్దిసేపు తమ వాహనాలను నిలిపి రైలింజన్‌ను ఆసక్తిగా గమనించారు. తమ ఫోన్లలతో రైలింజన్ చిత్రాలను బంధించారు. - అడ్డాకుల

క్లుప్తంగా

ముగిసిన ఉత్సవాలు



నవాబుపేట: మండల పరిధిలోని లోకిరేవు వీరభద్రస్వామి ఉత్సవాలు మంగళవారం ముగించినట్లు పూజారి లింగయ్య స్వామి తెలిపారు. కాగా చివరి రోజు మహా మంగళహారతి కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా తొమ్మిది రకాల నవహారతులు స్వామికి అర్పించినట్లు పేర్కొన్నారు.

రేణుకాఎల్లమ్మ బోనాలు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని 24వ వార్డులో ఉన్న రేణుకాఎల్లమ్మ ఆలయంలో మంగళవారం పురస్కరించుకుని మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి ఒక్కొక్కరుగా బోనాలతో వచ్చి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించారు. అదేవిధంగా మరి కొంతమంది మహిళలు అమ్మవారికి వడి బియ్యం పోశారు.

ఆస్తిపన్నులు తగ్గించాలని డిమాండ్



భూత్పూర్: ఆస్తిపన్నులు తగ్గించాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం అధికారులను నిలదీశారు. పట్టణంలోని గృహాలకు ఇతర మున్సిపాలిటీల కంటే ఎక్కువ మొత్తంలో పన్నులు విధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్‌తో విషయం వివరించారు. కాగా గృహ యజమానులు సరైన పత్రాలు సమర్పించాలని, పత్రాల ఆధారంగా అనుమతులు, ఆస్తి పన్ను విధింపు ఉంటుందని అధికారులు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు



కోయిల్‌కొండ: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారికి చికిత్స అందించడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని డీఎంహెచ్‌ఓ కృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వైద్యా ఆరోగ్య సేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సేవలపై ఆరాతీశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారులు శ్రీధర్‌రెడ్డి, శంకర్, భాస్కర్‌నాయక్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి చేయూత

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రానికి చెందిన కొత్వాల్ హామిద్ కుమార్తె వివాహానికి సామాజిక వేత్త షేక్ అబ్దుల్ జాంగీర్ మంగళవారం రూ. 20 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కిష్టన్న, నాయకులు రవి, నీలి ఆంజనేయులు, రాములు, శాంతన్న, షబ్బీర్ అలీ, వహిద్, బాబుజాని, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉత్సవాలు

మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో గురువారం నుంచి ఈశ్వర ఆంజనేయస్వామి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు.. ఆలయాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఉత్సవాలు రోజున జల్దిబిందె అనంతరం ధ్వజరోహణం, దేవత విగ్రహాలకు అభిషేకం, వస్త్ర పుష్పలంకరణాలు నిర్వహించి ఉత్సవాలు ప్రారంభం కొనసాగుతుందన్నారు. 24న ఉదయం రథోత్సవం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.